పూజింపబడుతోంది. మరణ సమయంలో అది జలంతో కలిసి మనిషి నోట్లోకి వెళ్ళి అతనికి సద్గతిని కూడా కలిగిస్తోంది. అహంకార రాహిత్యంతో మనిషి అమరత్వ సిద్ధిని చేరుకోగలడని తులసి ఆకు ఋజువు చేస్తోంది.

## 73. ఎవరిని ప్రేమించాలి?

ఆత్మ సాక్షాత్కారం పరమోత్కృష్టమైనదని తెలిసిన ఒకతను ఓ పరమ గురువు దగ్గరకి శిష్యరికం కోసం వెళ్ళాడు.

"స్వామీ! దయతో నన్ను మీ శిష్యునిగా చేసుకోండి. మీ గురుత్వంతో నన్ను తరింప చేయండి." ప్రార్థించాడతను.

"నువు ఎక్కువగా ప్రేమించేది ఎవర్ని?" ప్రశ్నించాడు గురువు.

"నా కుటుంబాన్ని నేనెలా ప్రేమిస్తానో, నా బంధుమిత్రులని, వాళ్ళనెలా ప్రేమిస్తానో అలాగే నా దేశ ప్రజలని కూడా ప్రేమిస్తాను తప్ప నాకు ప్రత్యేకంగా ఎక్కువ ప్రేమించే వాళ్ళంటూ ఎవరూ లేరు స్వామీ." జవాబు చెప్పాడు అతను.

"నువ్వింకా పరిపక్వత చెందలేదు. నీకు ప్రత్యేకంగా ఎవరిమీదైనా ప్రేమ కలిగే దాకా ఆగి అప్పుడు రా." చెప్పారాయన.

అతను వెళ్ళిపోయి కొంతకాలానికి తిరిగి ఆయన దగ్గరకి వచ్చాడు.

"స్వామీ! మీరు చెప్పినట్లుగా నా ప్రేమ మారింది. నేను మీ శిష్యుడయ్యే అర్హత సంపాదించానని అనుకుంటున్నాను," చెప్పాడు.

"ఇప్పుడు నువు ఎవరిని ఎక్కువగా ప్రేమిస్తున్నావు?" ప్రశ్నించాడు గురువు.

"మాతృ దేవో భవ, పితృ దేవో భవ అన్నారు కదా! నా తల్లితండ్రుని నేనిప్పుడు అందరికన్నా అధికంగా ప్రేమిస్తున్నాను."

"నీ ప్రేమ వారినుంచి కూడా మరలేదాకా ఆగి ఆ తర్వాత వచ్చి కనబడు." చెప్పాడు గురువు.

ఇంకొంచెం కాలం అయాక అతను మళ్ళీ గురువు దగ్గరకి వచ్చి అడిగాడు.

"స్వామీ! మళ్ళీ నా ప్రేమ మరొకరి మీదకి మళ్ళింది. ఇప్పుడైనా మీరు నన్ను శిష్యుడిగా స్వీకరిస్తారని ఆశించవచ్చా?"

"ఇప్పుడు నీ ప్రేమ ఎవరిమీద ఉంది?" ప్రశ్నించాడు గురువు.

"పూర్తిగా ఆ భగవంతుడి మీదే స్వామి. విష్ణువు మీద నుంచి నా ప్రేమ పక్కకి మరలడం లేదు."

"మరి కొంత కాలం వేచి ఉండు. నీ ప్రేమ మళ్ళీ మరలాక వచ్చి కనబడు."

"అసంభవం స్వామి! నా ప్రేమ నా ఇష్ట దైవం మీంచి ఇక మరలదు అనిపిస్తోంది."

అయినా గురువు మాట మీద గౌరవం ఉంచి వెళ్ళిపోయాడతను. మరి కొంత కాలానికి అతను తిరిగి ఆ గురువు దగ్గరకి వచ్చాడు.

"మీరు చెప్పినట్లుగా మళ్ళీ నా ప్రేమ మళ్ళింది స్వామి." చెప్పాడతను.

"ఈ సారి ఎవరి మీదకి?" చిరునవ్వుతో ప్రశ్నించాడు గురువు.

"ప్రపంచంలోని సర్వ ప్రాణికోటి మీదకి. మనుష్యులనే కాక నేనిప్పుడు ఇతర జీవులని కూడా సమానంగా ప్రేమిస్తున్నాను. పూర్వం కేశవుడ్ని విగ్రహంలో చూసేవాడిని. కాని నాకిప్పుడు ఆ కేశవుడు సర్వ ప్రాణికోటిలో దర్శనం ఇస్తున్నాడు. ప్రతీ జీవిలో పరమాత్ముణ్ణి చూస్తున్నాను."

"ఇప్పుడు నీకు ఇక గురువుతో పనిలేదు."

దూరం నించే అతనికి ఆధ్యాత్మిక ప్రగతిని అందించిన ఆ గురువు చిరునవ్వుతో చెప్పాడు.